సాక్షి అనకాపల్లి

శనివారం । 27 । జూలై । 2024



జింకల సందడి

విశాఖ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో కొండల పైనుంచి వచ్చిన చుక్కల జింకలు శుక్రవారం సందడి చేశాయి.



అందరి ఆమోదంతో..

రైతుల అభీష్టం మేరకు తాండవ నీటిని విడుదల చేసేందుకు తేదీని ఖరారు చేస్తామని డీఈ అనురాధ చెప్పారు.

8లో

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 27న 5 మి.మీ, 28న 4, 29న 3, 30న 3, 31న 2 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 30.8 నుంచి 31.8 డిగ్రీలు, గాలి గంటకు 8 నుంచి 10 కి.మీ. వేగంతో వీస్తుందని ఆమె చెప్పారు.

న్యూస్‌రీల్

నేషనల్ వుషు పోటీలకు ఇద్దరు ఎంపిక



క్రీడాకారులకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న చైర్మన్ వెలగా నారాయణరావు

నర్సీపట్నం: జాతీయ స్థాయి వుషు పోటీలకు నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన ఇద్దరు బాక్సర్లు ఎంపికయ్యారు. గత నెల వూషూ అసోసియేషన్ నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ యూత్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో విత్తనాల లోకేష్, రౌతు నాగ లక్ష్మి స్వర్ణ పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. శనివారం నుంచి కోయంబత్తూరులో జరిగే నేషనల్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు క్రీడాకారులు లోకేష్, నాగలక్ష్మి, కోచ్‌లు యర్రా శేఖర్, ప్రియాంకలను అభినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి నర్సీపట్నానికి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు.

దివ్యాంగ సేవలపై జాతీయ అవార్డులకు దరఖాస్తులు

తుమ్మపాల: జాతీయ స్థాయిలో దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న దివ్యాంగులు, వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుంచి 2024 సంవత్సరానికి జాతీయ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లు కోరుతున్నారు. ఈ మేరకు సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ-న్యూఢిల్లీ ఉత్తర్వులిచ్చినట్లు విభిన్న ప్రతిభావంతుల జిల్లా సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు www.awardsgov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అవార్డుల కేటగిరీ, విధివిధానాలు, సూచనలు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

పవర్ లిఫ్టర్‌కు సత్కారం



పవర్ లిఫ్టర్ శ్రీనివాసరావు, కోచ్ నానాజీలను సత్కరిస్తున్న పవర్‌జిమ్ అసోసియేషన్ సభ్యులు

తుమ్మపాల: ఈనెల 21 నుంచి 26 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన ఇండోర్ మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన 59 ఏళ్ల వయస్సు ఎం.శ్రీనివాసరావు బంగారు పతకం సాధించి రికార్డు సృష్టించారని కోచ్ వసాది నానాజీ తెలిపారు. పట్టణంలో పవర్ లిఫ్టింగ్ జిమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించి అభినందించారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ఆర్థికంగా వెనుకబడినా స్థోమతను మించి క్రీడలపై మక్కువతో సాధన చేస్తూ భావితరాలకు శ్రీను ఆదర్శంగా నిలిచారని అసోసియేషన్ అధ్యక్షులు నీలా అన్నారు. అతనికి ప్రోత్సాహంగా ఆర్థికంగా మద్దతు ఇచ్చి త్వరలో జరగబోయే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సహకరిస్తే మనదేశానికే వన్నె తీసుకువచ్చి పతాకాన్ని సాధించే పట్టుదల ఉందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి సోమునాయుడు, సీనియర్ వెయిట్ లిఫ్టర్ ఎం.ఎస్.ఎస్.అప్పారావు, క్రీడాకారులు ఆళ్ల ప్రవీణ్, వేగి అజయ్, అందే గణేష్, అన్ని జిమ్‌ల సభ్యులు పాల్గొన్నారు.



రైతే రాజు..

మళ్లీ వచ్చేనా ఆ రోజు!

దేశానికి వెన్నెముక రైతు. రైతు బాగుంటేనే ఏ ప్రాంతమైనా సుభిక్షంగా ఉంటుంది. అనకాపల్లిలాంటి వ్యవసాయాధార జిల్లాలో రైతులు బాగుండాలంటే సాగునీటి వసతి పుష్కలంగా ఉండాలి. జిల్లాలో ఉన్న ఐదు రిజర్వాయర్ల ఆధునికీకరణకు కృషి చేసిన ఏకైక వ్యక్తి దివంగత మహానేత వైఎస్సార్. ఆ తర్వాత గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే జిల్లాలోని రైతుల్ని పట్టించుకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబుగానీ, వైఎస్సార్ మరణం తర్వాత అధికారాన్ని కొనసాగించిన కాంగ్రెస్ సీఎంలుగానీ రైతుల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ఇప్పుడైనా జగన్ ప్రభుత్వం చేపట్టిన ఆధునికీకరణ పనుల్ని సీఎం చంద్రబాబు పూర్తిచేసి, సాగునీటికి ఢోకా లేకుండా చూడాలని **జిల్లా రైతాంగం కోరుతోంది.**

- **వైఎస్సార్ హయాంలో రూ.112 కోట్లతో ఆధునికీకరణ**
- **ఆయన మరణాంతరం పట్టించుకోని ప్రభుత్వాలు**
- **వైఎస్ జగన్ పాలనలో రూ.176 కోట్లు మంజూరు**
- **ఐదు జలాశయాల పరిధిలో 1.80 లక్షల మంది రైతులు**
- **జిల్లాలో ఆయకట్టు పరిధి 74,500 ఎకరాలు**
- **ఆధునికీకరణ పనులు కొనసాగించాలని రైతుల వినతి**



తాండవ జలాశయం

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో జలాశయాలకు మళ్లీ గ్రహణం పట్టింది. జిల్లా వ్యవసాయానికి జీవనాడులుగా ఉన్న తాండవ, కల్యాణపులోవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు నిండుగా కళకళలాడుతున్నాయనుకుంటే పొరపాటే. ఆయా జలాశయాల్లో పూడిక తొలగింపు, గట్ల ఆధునికీకరణ పనులు చేపట్టక మట్టి నిల్వలు పేరుకుపోయి, నీటి నిల్వ సామర్థ్యం క్షీణించింది. మరోవైపు జలాశయాల కాల్వల్లో పూడిక తొలగించకపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే పరిస్థితి లేదు.

తండ్రీ, తనయులే రైతు బాంధవులు

జిల్లాలో జలాశయాల ఆధునికీకరణకు కృషి చేసిన సీఎంలు దివంగత వైఎస్సార్ తర్వాత, గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. చివరి ఆయకట్టు వరకూ సాగు నీరు అందాలన్న ఆశయంతో వైఎస్సార్ నిధులు వెచ్చించారు. ఆయన మరణాంతరం వచ్చిన కాంగ్రెస్ సీఎంలు, అంతకు ముందు, ఆ తర్వాత 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడు రైతుకు సాయం చేయలేదు. పైగా వ్యవసాయం దండగమారి వ్యవహారం అంటూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి రెండేళ్లు కోవిడ్‌తో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలం అయినా రూ.144.72 కోట్లతో జలాశయాల ఆధునికీరణ పనులు చేపట్టారు. అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ పనులు కొనసాగించాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

నిర్లక్ష్య 'తాండవ'ం

నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం, గొలుగొండ మండలాల్లో ఉంది. దీని ద్వారా రెండు జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో 32 వేల ఎకరాలకు ఈ నీరే ప్రధాన ఆధారం. వైఎస్సార్ హయాంలో రూ.22 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ పాలనలో మినహా మరెవరూ ఈ జలాశయాన్ని పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వంలో రూ.30 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో ఈ పనుల కొనసాగింపులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు.

పెద్దేరు.. రైతు బేజారు

పెద్దేరు జలాశయం మాడుగుల మండలంలో ఉంది. దీని సామర్థ్యం 0.36 టీఎంసీలు. 19,500 ఎకరాలకు సాగు నీరందిస్తోంది. వైఎస్సార్ హయాంలో రూ.38 కోట్లతో ఆధునికీకరించారు. ఆ తర్వాత వచ్చిన సీఎంల నిర్లక్ష్యంతో రైతులు ఆయకట్టుకు సరిపడా నీరందక ఇబ్బంది పడ్డారు. మళ్లీ గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.84.40 కోట్లు మంజూరు చేయడంతో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం మారడంతో పనులు ఏ మేరకు కొనసాగుతాయోనన్న ఆందోళనలో రైతులున్నారు.

నాడు 'రయ్'వాడ.. నేడు 'నై'వాడ

దేవరాపల్లిలోని రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీలు. వైఎస్సార్ హయాంలో రూ.22 కోట్లతో ఆధునికీకరించారు. ఆ తర్వాతి ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మళ్లీ ఆధునికీకరణ ఆశలు రేకెత్తాయి. ఇందుకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. కానీ కాంట్రాక్టర్ అర్ధంతరంగా వెళ్లిపోవడంతో పనులు పూర్తి కాలేదు. రూ.2 కోట్లతో చేపట్టిన 56 కి.మీ.పొడవున కాలువలో పూడికతీత పనులు మాత్రం పూర్తయ్యాయి.

కల్యాణపులోవను పట్టించుకునేనా?

చోడవరం నియోజకవర్గంలో ఉన్న కల్యాణపులోవ అభివృద్ధికి వైఎస్సార్ హయాంలో రూ.30 కోట్లతో పనులు చేపట్టారు. వైఎస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్, టీడీపీ సీఎంలు అటువేపు దృష్టి సారించ లేదు. టీడీపీ ప్రభుత్వంలో పూడిక తొలగింపు పనులకూ ఆసక్తి చూపలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.32 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. దీంతో 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఈ జలాశయ ఆధునికీకరణకు కూడా నిధులు వెచ్చించాలని రైతులు కోరుతున్నారు.

చంద్రబాబుదే ఆ పాపం

భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న నీటితో రిజర్వాయర్లు నిండుకుండల్ని తలపిస్తున్నాయి. అయినా చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. ఈ పాపం టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబుదేనని ఆక్షేపిస్తున్నారు. రిజర్వాయర్లు, కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించకపోవడంతో నీటి నిల్వ, ప్రవాహ సామర్థ్యం బాగా తగ్గింది. 1994–2004, 2014–2019 కాలంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడూ రైతుల్ని పట్టించుకోలేదు. ఇప్పుడూ అదే తీరున వ్యవహరిస్తే రైతుకు కన్నీళ్లు తప్పవు.

జలాశయాల తీరు

జిల్లాలో రిజర్వాయర్లు
తాండవ, కల్యాణపులోవ, పెద్దేరు, కోనాం, రైవాడ

ఆయకట్టు విస్తీర్ణం
జిల్లా పరిధిలో 74,500 ఎకరాలు

సాగు రైతులు
1.80 లక్షల మంది

వైఎస్సార్ హయాంలో నిధులు
జలయజ్ఞం పథకంలో
రూ.112 కోట్లతో ఆధునికీకరణ పనులు

వైఎస్ జగన్ హయాంలో కేటాయింపులు
రూ.144.72 కోట్లు
(కొన్ని పనులు పూర్తి, కొన్ని మధ్యలో..)



మాజీ సీఎం జగన్ హయాంలో రైవాడ గేట్ల వద్ద పూర్తయిన ఆధునికీకరణ



తాండవ జలాశయం వద్ద గత ఏడాది చేపట్టిన నవీకరణ పనులు

తండ్రి, తనయులతో రైతుకు మేలు



నాకు 15 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం వర్షాలు బాగా పడ్డాయి. రైవాడ రిజర్వాయర్ కళకళలాడుతోంది. ఆనాడు దివంగత సీఎం వైఎస్సార్ ఆధునికీకరణ పనులు చేయడం వల్లే ఇప్పుడు మాకు సాగు నీరు పుష్కలంగా అందుతోంది. రైవాడ రిజర్వాయర్ ఆయకట్టు పరిధి 19,500 ఎకరాలు. ప్రస్తుతం 15 వేల ఎకరాలకే సాగునీరు అందుతోంది. అదనపు కాలువ పనులు పూర్తయితే పూర్తిస్థాయిలో సాగునీరు ఆయకట్టుకు చేరుతుంది. గత సీఎం జగన్ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. రైతుల మేలు కోసం ఈ ప్రభుత్వం ఆ పనుల్ని పూర్తి చేయాలి.

– **సిరవరపు గంగాధరరావు**, ఆయకట్టు రైతు, అలమండ గ్రామం

రైతు బాంధవుడు వైఎస్సార్



వ్యవసాయమంటే వైఎస్సార్‌కు మక్కువ ఎక్కువ. రైతుల సంక్షేమం కోసం జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు రైతులకు ఎంతో మేలు చేశాయి. తాండవ పరిధిలో రెండు జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందుతోందంటే.. ఆనాడు వైఎస్సార్ చేపట్టిన ఆధునికీకరణ పనులే కారణం. ఆయన మరణించినా మాలాంటి రైతుల గుండెల్లో రైతు బాంధవునిగా చిరస్థాయిగా నిలిచిపోయారు. అదే బాటలో గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన రిజర్వాయర్ ఆధునికీకరణ పనులను కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొనసాగించాలి.

– **రెడ్డి అచ్చియ్యనాయుడు**, తాండవ ఆయకట్టు రైతు

యుద్ధప్రాతిపదికన రంధ్రం పూడ్చివేతకు చర్యలు

- తాండవ కుడి కాలువకు గండి పడే ప్రమాదం
- స్పందించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు



తాండవ కుడి కాలువకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ అనురాధ, నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

నాతవరం: తాండవ కాలువను ఆనుకొని ఏర్పడిన రంధ్రాన్ని యుద్ధప్రాతిపదికన పూడ్చివేసేందుకు చర్యలు చేపడతామని ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. ఈనెల 26వ తేదీన 'తాండవ ప్రధాన కుడి కాలువకు గండి ముప్పు' అనే శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. రంధ్రం పడిన ప్రదేశాన్ని శుక్రవారం ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈ రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేవుడు, మాజీ నీటి సంఘం నాయకుడు అప్పన విజయ్, నర్సీపట్నం మండలం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, చమ్మచింత మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాశపు నూకరాజు, మాజీ డైరెక్టరు సత్యనారాయణ పరిశీలించారు. ఈ రంధ్రాన్ని పూడ్చకపోతే కుడి కాలువ నీటి ప్రవాహం నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. పనులు చేసేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

అమరావతికి అప్పు ఇస్తే హర్షాతిరేకాలా?

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న ఎద్దేవా



దేవరాపల్లి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఒరగబెట్టిందేమీ లేదని, అయినా కూటమి నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణంగా సమకూర్చుతామని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారని, దాన్ని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, స్థానిక ఎంపీ సీఎం రమేష్ సహా కూటమి నేతలు ప్రభుత్వ గ్రాంట్‌గా ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ జనం చెవుల్లో పూలు పెట్టడమేనని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌పై వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, విభజన సమస్యల పరిష్కారంలో కేంద్రం ఇప్పటికీ రాష్ట్రాన్ని మోసం చేస్తోందని ఆరోపించారు.

ఉచిత ఇసుకపై సమీక్ష

తుమ్మపాల: ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా పథకంలో కేవలం రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేయనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. ఉచిత ఇసుక సరఫరా పథకం అమలుపై భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ప్రభుత్వ సూచనలు, ఇసుక పాలసీ అమలుపై పలు అంశాలను చర్చించారు. కొనుగోలుదారునికి రవాణా రేటు కూడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఇసుక నిల్వ పాయింట్ల వద్ద రవాణా చార్జీలను డిస్‌ప్లే చేయాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ట్రక్కులను అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించిన ప్రకారం రవాణా చార్జీలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అమర వీరులకు వందనం



కార్గిల్ అమర వీరులకు నివాళిగా మౌనం పాటిస్తున్న అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య తదితరులు

అనకాపల్లి: ప్రాణాలను లెక్క చేయకుండా కుటుంబాన్ని పక్కనపెట్టి, దేశం కోసం ప్రాణత్యాగానికి వెనుకాడని సైనికులకు సెల్యూట్ అని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలైన సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం కోసం పోరాడుతున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మొదటి అడిషినల్ జూనియర్ న్యాయమూర్తి ఎ.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జి.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షుడు రాజా తదితరులు పాల్గొన్నారు.



కార్గిల్ యుద్ధవీరులకు వందనమంటూ నెహ్రూచౌక్ వద్ద మానవహారం

నెహ్రూచౌక్ సెంటర్‌లో మానవహారం

స్థానిక నెహ్రూచౌక్ వద్ద బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ దివస్‌ను ఘనంగా జరిపారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు అగ్గాల హనుమంతరావు, ఎం.ఈశ్వరరావు, సతీష్, సత్యారావులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు శాలువాతో సత్కరించారు. తొలుత బీజేపీ నాయకులు, విద్యార్థులు ఎన్టీఆర్ క్రీడామైదానం నుంచి నెహ్రూచౌక్ వరకూ ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శివశంకర్, అప్పారావు, ఆదిరాజు, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ పాల్గొన్నారు.

విశాఖలో..

బీచ్ రోడ్డు: విశాఖ నగరంలో పలుచోట్ల కార్గిల్ దివస్‌ను ఘనంగా జరిపారు. అమర వీరులకు నివాళులర్పించారు. స్మారక చిహ్నాల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించారు. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లోని యుద్ధ స్మారక చిహ్నం వద్ద 50 మంది సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, నేవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వైస్‌అడ్మిరల్ వి.కె.నంబల్లా (రిటైర్డ్), బ్రిగేడియర్ జె.కె.బారువా, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.సత్యనాథం పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ



విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈవో

కశింకోట : విద్యార్థులకు డిజిటల్ విద్య అందివ్వడం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. కశింకోటలోని బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్, ఐఎఫ్‌పీ ప్యానల్‌పై నిర్వహిస్తున్న విద్య బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానల్స్ అందుబాటులో ఉండడంతో పాటు ట్యాబులు కూడా అందివ్వడం వల్ల వాటి ద్వారా విద్యా బోధనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వృత్తి విద్యా సామగ్రి, బోధనా సిబ్బంది నైపుణ్యాన్ని పెంపొందించి భవిష్యత్‌లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవడానికి దోహదపడాలన్నారు. బాలికలకు ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలపైన ఆసక్తి పెంపొందించాలన్నారు. ఎలక్ట్రానిక్స్ నేర్పించడం ద్వారా తమ ఇళ్లలో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకునే పరిజ్ఞానం నేర్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలను, వారి చదువు తీరును పరిశీలించారు. అలాగే సైన్స్ ల్యాబ్‌లో పరికరాల ప్రదర్శన, వృత్తి విద్యా పరికరాలపై విద్యా బోధన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఎంఈవో-2 కె.ఎస్.ఎన్ మూర్తి, డీఎస్‌వో దాడి కాళిదాసు, పీడీ పి.కమల పాల్గొన్నారు.

విశాఖ తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లోని యుద్ధ స్మారక చిహ్నం వద్ద 50 మంది సిబ్బంది పరేడ్ నిర్వహించి కార్గిల్ యుద్ధ వీరులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, నేవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వైస్ అడ్మిరల్ వి.కె. నంబల్లా (రిటైర్డ్), బ్రిగేడియర్ జె.కె.బారువా, వింగ్ సీడీఆర్ పి.శ్యామ్‌కుమార్, జిల్లా సైనిక్ **వెల్ఫేర్ ఆఫీసర్ జి.సత్యనాథం తదితరులు స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించారు.** - బీచ్ రోడ్డు

విశాఖలో కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళి





కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులు అర్పిస్తున్న నావికాదళ సిబ్బంది



కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, సీపీ శంఖబ్రత బాగ్చి

స్కూళ్ల అభివృద్ధి పనుల్లో
నిర్లక్ష్యం వద్దు

- ఎస్ఐఐ స్టేట్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు



స్కూల్లో మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్న రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

యలమంచిలి రూరల్ : ప్రభుత్వ రంగంలో వివిధ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల్లో జాప్యంపై స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్(ఎస్ఐఐ) రాష్ట్ర కో ఆర్డినేటర్ కొల్లూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చినగొల్లలపాలెం, సోమలింగపాలెం, జంపపాలెం, కట్టుపాలెం, తెరువుపల్లి హైస్కూళ్లు, యూపీ, ఎంపీపీ స్కూళ్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గత ప్రభుత్వంలో మనబడి నాడు-నేడు పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మధ్యలో నిలిచిన పనుల్ని ప్రస్తుత ప్రభుత్వం స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్యక్రమంగా పేరు మార్చి అమలు చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర కోఆర్డినేటర్ పనుల పురోగతిని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో నాడు నేడు బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న నగదు, స్కూళ్లలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. టైల్స్ పని పూర్తి కాని స్కూళ్లలో కారణాలను తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నిధులతో వెంటనే మౌలిక వసతుల అభివృద్ధి పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా స్కూళ్లకు సరఫరా చేసిన మెటీరియల్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

వ్యాన్ ఢీకొని గాయపడ్డ వ్యక్తి మృతి

అనకాపల్లి: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ నర్సీపట్నంకి చెందిన వడ్లపాటి మహాకాళీ (27) మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు కథనం మేరకు వివరాలివి. బుధవారం రాత్రి విశాఖ నుంచి నర్సీపట్నం ద్విచక్రవాహనంపై వెళుతున్న మహాకాళీని అనకాపల్లి జాతీయ రహదారి డైట్ కళాశాల వద్ద అదే రహదారిలో వెళుతున్న హ్యాచరీ వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అతనిని స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్చి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మృతుడి భార్య నాగరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.



పాము కాటుతో మహిళ మృతి

రాంబిల్లి (యలమంచిలి) : బహిర్భూమికి వెళ్లిన మహిళ పాముకాటు బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. రాంబిల్లి సీఐ సిహెచ్. నర్సింగరావు తెలిపిన వివరాలివి. మండలంలో పెదకలవలాపల్లి గ్రామానికి చెందిన కలవలాపల్లి రమణమ్మ (60) 10వ తేదీన ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న కొబ్బరితోటలోకి బహిర్భూమికి వెళ్లగా పాముకాటు బారిన పడింది. ఆమెను కుటుంబ సభ్యులు విశాఖపట్నం కింగ్‌జార్జ్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందింది. ఈ మేరకు ఆమె భర్త అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అనకాపల్లి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు తగిలినట్టు రూరల్ పోలీస్‌లకు శుక్రవారం ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు కథనం మేరకు వివరాలివి. మండలంలో శంకరం గ్రామం వద్ద ముందు వెళ్లుతున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో లారీ వెనుక వెళుతున్న కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బాలబాలాజీ శర్మ, నాగజ్యోతి, కుమారిలకు స్వల్పగాయాలు అయ్యాయని ఎస్ఐ చెప్పారు. కారు విజయనగరం నుంచి రాజమహేంద్రవరం వెళ్లి తిరుగు ప్రయాణంలో విజయనగరం వెళుతున్న సమయంలో కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారని ఎస్ఐ చెప్పారు. ఈమేరకు బాలబాలాజీ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

అదృశ్యమైన బాలిక క్షేమంగా
తల్లిదండ్రులకు అప్పగింత

అనకాపల్లి : విద్యార్థిని అదృశ్యమైనట్టు పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలివి. పట్టణంలో చదువులవారి వీధికి చెందిన ఇంటర్ విద్యార్థిని గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు ఆ విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హుటాహుటిన ఆమెకోసం కోసం గాలించారు. బాలిక ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా తన స్నేహితురాలు ఇంటికి వెళ్లిపోయినట్టు గుర్తించి, ఆమెను తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

రాంబిల్లి (యలమంచిలి) : మండలంలో ఒక గ్రామంలో మైనర్ బాలికపై ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కట్టుబోలు గ్రామానికి చెందిన ఇల్లపు గణేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి యలమంచిలి కోర్టులో హాజరుపరిచినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్. నర్సింగరావు విలేకరులకు తెలిపారు. న్యాయమూర్తి నిందితుడికి కండిషన్ బెయిల్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

దివ్యాంగుల ధర్నా

అనకాపల్లి: దేశంలో దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్ర సీనియర్ కలెక్టర్ స్మిత సబర్వాల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని పట్టణ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు మాట్లాడుతూ దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. లేనియడల 2016 దివ్యాంగుల హక్కుల చట్టప్రకారం ఆమె తక్షణమే కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి పెట్టండి

అనకాపల్లి : రాగల ఐదురోజులలో వర్షాలు, మబ్బు వాతావరణం ఉండే అవకాశం ఉన్నందున వరినారుమడిలో, పొడతెగు లు ఆశించే అవకాశం ఉందని నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మీ.లీ. లీటరు నీటిలో పిచికారి చేసి నివారించవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రసుత్త వాతావరణ పరిస్థితులకు వరిలో జింకులోప లక్షణాలు కనపడే అవకాశం ఉన్నందున నివారణకు లీటర్ నీటిలో 2 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలని ఆయన కోరారు. తేమను ఉపయోగించుకుని 10రోజుల వయసు ఉన్న వరి నారుమడిలో కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటుకు 150 గ్రా.ల చొప్పున వేసుకోవాలన్నారు. ఇప్పటికీ నారుమడి వేసుకోని రైతులు రానున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని నారుమడులు వేసుకోవచ్చని పేర్కొన్నారు. రాగి నారుమడిలో అగ్గితెగులు నివారణకు కార్బెండజిం 1 గా..లేదా ట్రైసైక్లోజోల్ 0.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాగి పైరును నాటుకునే రైతులు ఎకరాలకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలని, ఎకరాకు 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 13 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నాటేటప్పుడు వేసుకోవాలని సూచించారు. 30 రోజుల లోపు వయసుగల వేరుశనగ పంటలో మొదలు కుళ్లు ఆశించిన మొక్కలను తీసివేసి, తెగులు ఆశించిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారి చేయాలని సూచించారు. వేరుశనగ పైరును విత్తని రైతులు, పదును చూసుకుని విత్తుకోవాలన్నారు. కూరగాయల పంటలలో నారుమడి వేసుకునే రైతులు నారుమడి ఎత్తుగా వేసుకుని, మేటలాక్సిల్ 2 గ్రా..లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును 3గ్రా. లీటరు నీటిలో కలిపి నారుమడి తడిచేల పిచికారి చేసుకోవాలని, నారుమడిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు.

అందరి ఆమోదంతోనే తాండవ నీరు విడుదల చేస్తాం



సమావేశంలో తాండవ ప్రాజెక్టు ప్రధాన సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : ఖరీఫ్ సాగుకు తాండవ రిజర్వాయరు నుంచి నీటిని రైతులు ప్రజా ప్రతినిధుల అభీష్టం మేరకు విడుదల చేసేందుకు తేదీని ఖరారు చేస్తామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. మండల కేంద్రంలో గల తాండవ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం రెండు జిల్లాల పరిధిలో గల ఆయకట్టుదారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. డీఈ అనురాధ మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం 371.0 అడుగులు ఉందన్నారు. ఈ నీటిని రెండు కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే ఆయకట్టుకు కేవలం 60 రోజులు మాత్రమే ప్రవహిస్తుందన్నారు. వర్షాలు కురిసి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో నీరు వస్తే ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుందన్నారు. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా, డెడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులుగా తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కొంత కాలంగా తాండవ రిజర్వాయరు ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పుడున్న సమస్యలను వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్‌కు లేకుండా చేయాలన్నారు. జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స మాట్లాడుతూ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టు అయిన తాండవ నీటిని శివారు భూములకు సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పుఒప్పులను పక్కన పెట్టి ఈ ఖరీఫ్ సీజన్‌కు నీరు ఇచ్చే ప్రక్రియ చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ అన్నారు. తాండవ కాలువలో పూడికతీత పనులతో పాటు తుప్పలను తొలగిస్తే తప్ప ఆయకట్టుకు నీరు ప్రవహించదని నర్సీపట్నం మండలం నాయకుడు లాలం శ్రీరంగస్వామి అన్నారు. తమ ప్రాంతంలో చాలా చోట్ల కాలువలు పూడికతో నిండిపోయాయని కోటవురట్ల కోటనందూరు రవతలపూడి నర్సీపట్నం మండలాలు నాయకులు రైతులు తెలిపారు. తాండవ ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ సాగుకు ఆగస్టు 15 నుంచి 20 లోపు విడుదల చేస్తే అందరికీ బాగుంటుందని మెజార్టీ సభ్యులు తెలిపారు. దీనిపై డీఈ మాట్లాడుతూ అందరి అభిప్రాయాన్ని కలెక్టరు, ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. శాసన సభ స్పీకరు అయ్యన్నపాత్రుడితో మాట్లాడి తాండవ నీటిని విడుదల చేసే తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు తాండవ ప్రాజెక్టు జేఈలు శ్యామ్‌కుమార్ వినయ్‌కుమార్ పాత్రుడు రామకృష్ణ నాగబాబు పాల్గొన్నారు.

న్యాయం పొందడం ప్రతి పౌరుని హక్కు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి



మాట్లాడుతున్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి

చోడవరం రూరల్: న్యాయాన్ని పొందడమన్నది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని, అది బయట ఉన్న వారైనా, ఖైదులో ఉన్నవారైనా చట్టం ముందు అందరూ సమానమేనని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణలత అన్నారు. న్యాయ విజ్ఞాన వేదికలో భాగంగా శుక్రవారం ఆమె స్థానిక సబ్ జైలును సందర్శించారు. రిమాండ్ ఖైదీలకు అందించే ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఖైదీలకు న్యాయ విజ్ఞాన వేదికను నిర్వహించారు. ఖైదీలను ఉద్దేశించి పీడీఎం స్వర్ణలత మాట్లాడుతూ పేదలై ఉండి న్యాయవాదులను నియమించుకోలేని వారి లోక్ అదాలత్‌ను ఆశ్రయించి నట్టయితే వారికి ఉచిత న్యాయ సహాయం సైతం అందచేస్తామన్నారు. ఏమైనా స్వల్ప వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం మేలని సూచించారు. ఇక్కడ పరిష్కారమయ్యే కేసులకు పై కోర్టులకు అప్పీలకు వెళ్లడానికి సైతం ఉండబోదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సబ్ జైలు సిబ్బంది ఐ.గణేష్, కె.అప్పలనాయుడు, కె.మహదేవునాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమ నిధి అవార్డులకు దరఖాస్తులు

తుమ్మపాల: రాష్ట్ర, జాతీయ ఉపాధ్యాయ సంక్షేమ నిధి అవార్డులకు ఉపాధ్యాయులు ఆగస్టు 8వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల (ప్రైవేటు అన్ ఎయిడెడ్ మినహా) పాఠశాలల్లో అన్ని కేటగిరీల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్, స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల విద్యా కమిటీ 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసి ఆగస్టు 9న జిల్లా ఉప విద్యాశాఖ కార్యాలయానికి పంపగా, డివిజన్ స్థాయి కమిటీ 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసి ఆగస్టు 16న జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి నివేదికను అందిస్తుందని ఆమె పేర్కొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



ప్రదర్శనలో పరికరాలను తిలకిస్తున్న అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్

కె.కోటపాడు : విద్యార్థి దశలోనే పాఠశాలల్లో ల్యాబ్‌లలో అందుబాటులో ఉన్న సాంకేతికతను విద్యార్థులు ఉపయోగించుకొని మంచి ప్రయోగాలను చేయాలని అనకాపల్లి జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్ తెలిపారు. ఎ.కోడూరు హైస్కూల్లో శుక్రవారం శిక్షా సప్తహ కార్యక్రమం ఐదవ రోజు కార్యక్రమం అయిన డిజిటల్ వనరుల వినియోగం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న స్మార్ట్ టీవీ, లేబ్‌లలో ఉన్న పరికరాలను ఉపయోగించి విజ్ఞానాన్ని పొందాలన్నారు. ప్రయోగాలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభతో పాటు సృజనాత్మకత వెలుగులోనికి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డీవీడీ.ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు నాయుడు, అమృతరావు, రమాదేవి, బంగారునాయుడు పాల్గొన్నారు.

అమ్మాయిల ఫొటోలు పెట్టి..
రూ.28 లక్షలు కాజేసి..

- ఇంజినీర్‌ను బురిడీ కొట్టించిన ముఠా
- తెలంగాణ వాసి అరెస్ట్.. పరారీలో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న సైబర్ క్రైం సీఐ భవానీ ప్రసాదరావు

మధురవాడ: తెలంగాణకు చెందిన ఓ ముఠా అందమైన అమ్మాయిల ఫొటోలతో ఓ ఇంజినీర్‌ను బురిడీ కొట్టించింది. ఎమోషనల్‌గా అతన్ని బ్లాక్ మెయిల్ చేసి రూ.28 లక్షలు కాజేసింది. మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయటపడింది. ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన కృష్ణ మనోజ్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొమ్మగోని లోకేష్, సాయిధీరజ్, మైకల్ షాలిని ముఠాగా ఏర్పడ్డారు. డేటింగ్ యాప్ ద్వారా కృష్ణ మనోజ్‌ను పరిచయం చేసుకున్నారు. తర్వాత నకిలీ ఇన్‌స్టా గ్రామ్ ఐడీని అతనికి ఇచ్చి.. చాటింగ్ మొదలు పెట్టారు. వాట్సాప్‌లో చాట్ చేసి అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి ఎమోషనల్‌గా దగ్గరయ్యారు. ఇలా చాటింగ్ చేస్తూనే.. డబ్బులు అవసరమని నమ్మించి రూ.28లక్షలు కాజేశారు. మోసపోయాయని ఆలస్యంగా గ్రహించిన బాధితుడు నగరంలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్, మన్సురాబాద్‌కి చెందిన కొమ్మగోని లోకేష్(25)ను అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

అప్రమత్తంగా వ్యవహరించండి : సైబర్ మోసాలు చాలా విస్తృతంగా జరుగుతున్నాయని, వాటి పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని సీఐ భవానీప్రసాద్ నగర ప్రజలను హెచ్చరించారు. ఏపీకే లింక్‌లు వంటి వాటి ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసగాళ్లు డబ్బులు కోసం డేటింగ్ యాప్, మ్యాట్రిమోనీల ద్వారా పరిచయం పెంచుకుని మోసగిస్తున్నారని హెచ్చరించారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 13 వేల మంది మోసపోయారని, సుమారు రూ.21 కోట్ల వరకు నగదు రికవరీకి చర్య లు చేపట్టామన్నారు. డబ్బులు పోగొట్టుకున్న గంటలోపే పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేయాలని సూచించారు. ఆలస్యమైతే మోసగాళ్లు కొట్టేసిన నగదు 13 లేయర్స్‌గా వివిధ ఖాతాల్లోకి జమ అయి.. క్రిప్టో కరెన్సీగా మారిపోతుందన్నారు. ఈ కేసు ను ఛేదించిన ఏఎస్ఐ శ్రీనివాసరావు, పీసీలు సత్యనారాయణ, శేఖర్‌లను సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.



క్లుప్తంగా

'ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి'



సచివాలయం-7లో ఆధార్ సేవలు అందిస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలని 7వ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి కనిశెట్టి ఉమ తెలిపారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు పైబడిన చిన్నారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, మార్పులు, చేర్పులు అవసరమైన వారు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజల సౌకర్యార్థం దశలవారీగా ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి ఎస్.అపర్ణ పట్నాయక్, సచివాలయం ఉద్యోగి ప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు



సెయింట్ జాన్స్ స్కూల్లో కెప్టెన్, వైస్ కెప్టెన్‌లతో పాట్రన్ కెనాన్ జాన్, ఉపాధ్యాయ సిబ్బంది

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో విద్యార్థుల నుంచి కెప్టెన్, వైస్ కెప్టెన్‌ల నియామకం జరిపినట్లు స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులు కవాతు నిర్వహించి ముఖ్య అతిథి పాట్రన్ కెనాన్ జాన్‌కు గౌరవ వందనం చేశారు. జాన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ అనూరాధ, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రసాద సేవ

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శనివారం నుంచి ప్రతివారం ప్రసాద సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా భక్తుల సహకారంతో ప్రతివారం సుమారు 5 కిలోల ప్రసాదం వితరణ చేస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 46 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,960	3,960
మూడోరకం	3,510	3,510

అనకాపల్లి సినిమాలు

డెడ్‌పూల్ వుల్వరీన్	: రాజా
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు	: సత్యనారాయణ స్క్రీన్-2
రాయన్	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
పురుషోత్తముడు	: వెంకటేశ్వర
రామ్ ఎన్ఆర్ఐ	: శ్రీసత్య
ఆపరేషన్ రావన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 362 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



అనకాపల్లి-విశాఖ రహదారిలో వర్షాలకు పాడైన రోడ్డు



గోతులమయంగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే నాయిళ్లవీధి రోడ్డు



జలగలమదుం పెట్రోల్ బంక్ వద్ద దుస్థితి

రహదారులు ఛిద్రం.. వాహనదారులూ జర భద్రం

- వర్షపు నీటితో రోడ్డేదో.. గొయ్యేదో తెలియని దుస్థితి
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- గోతుల్ని క్రషర్ బుగ్గితోనైనా పూడ్చాలని మొర

ఇటీవలి వర్షాలకు పట్టణ, మండల పరిధిలో రోడ్లు ఛిద్రమయ్యాయి. చాలా చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు చేరి రోడ్డేదో.. గొయ్యేదో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా మంది తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. కనీసం గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



మండలంలో మూలపేటకు వెళ్లే దేవీనగర్ రహదారిలో వాహనదారుని ఇక్కట్లు



విశాఖకు వెళ్లే దారిలో ఓ పెట్రోల్ బంక్ వద్ద వర్షాలకు ఛిద్రమైన రోడ్డు



అనకాపల్లి-చోడవరం రహదారిలో ఊడేరు గ్రామం వద్ద రోడ్డు స్థితి

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలో రోడ్లు దారుణంగా పాడయ్యాయి. గతంలో చేపట్టిన మరమ్మతులు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయాయి. చాలా రోడ్లలో భారీ గోతులు ఏర్పడ్డాయి. నడిచి వెళ్లేందుక్కూడా వీల్లేనంతగా రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో వాహనదారుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. వీలైనంత వేగంగా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

ప్రధాన రోడ్లలో భారీ గోతులు

– సుంకరమెట్ట జంక్షన్ నుంచి జలగలమదుం జంక్షన్ హైవేకి వెళ్లే దారిలో పెట్రోల్ బంకుల వద్ద పెద్ద పెద్ద గోతులతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. విశాఖ నుంచి అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఇదే ప్రధాన మార్గం. పగటి సమయంలో వాహనదారులు కాస్త జాగ్రత్తగా చూసుకుని మరీ రాకపోకలు సాగిస్తున్నా.. రాత్రి సమయంలో ప్రయాణించేవారికి ఇబ్బందులు తప్పట్లేదు.

- అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లాలంటే విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారానే రాకపోకలు సాగించాలి. వర్షాలు పడుతున్న సమయంలో అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో వాహనాలు పాడైపోతాయని, ట్రాఫిక్ పోలీస్‌లు, జీవీఎంసీ అధికారులు లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా వాహనాలను మళ్లిస్తారు. అయితే ఈ రహదారి కూడా తాజా వర్షాలకు భారీగా దెబ్బతింది.
- తుమ్మపాల పంచాయతీ పరిధి చిన్నబాబు కాలనీలో రహదారి వర్షాలకు పాడైపోవడంతో స్థానిక యువత కొంత నగదు వేసుకుని గోతుల్ని పూడ్చారు.
- మండలంలోని ఊడేరు, బవులవాడ, సీతానగరం, సత్యనారాయణపురం, మూలపేట, కొత్తూరు రహదారులు కూడా తాజా వర్షాలకు చాలా చోట్ల పాడయ్యాయి. పెద్ద పెద్ద గోతుల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



మాది మూలపేట గ్రామం అనకాపల్లి పట్టణానికి 3 కి.మీ. దూరం. నిత్యం దాదాపు 300 మంది ఈ రోడ్డు మీదుగా అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. స్థానిక శారదానది బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం పంచాయతీ మీదుగా మూలపేటకు వెళ్లే రహదారి దేవీనగర్ సమీపంలో వర్షాలకు పూర్తిగా పాడైపోయింది. గోతులతో రాకపోకలు సాగించాలంటే చాలా కష్టంగా ఉంది. అధికారులు చొరవ తీసుకుని గోతుల్ని పూడ్చాలి.

– కె.కోటేశ్వరి, సత్యనారాయణపురం పంచాయతీ, మూలపేట

క్రషర్ బుగ్గితోనైనా గోతుల్ని పూడ్చాలి



వర్షాలకు పాడైపోయిన రహదారులకు తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, తొలి దశలోనే గోతుల్ని పూడ్చాలి. అనకాపల్లి నుంచి విశాఖకు నిత్యం వేలాది మంది వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిలో రెండు పెట్రోలు బంకుల వద్ద పెద్దపెద్ద గోతులతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని గోతుల్లో నీటిని తొలగించి, కనీసం క్రషర్ బుగ్గితోనైనా పూడ్చాలి.

– గొర్లి వెంకటేశ్వరులు, అనకాపల్లి

త్వరలోనే మరమ్మతులు

వర్షాలకు చాలా వరకు రోడ్లు పాడైపోయాయి. వర్షాలు తగ్గిన వెంటనే వీటిపై నివేదికలు సిద్ధం చేస్తాం. తాత్కాలిక మరమ్మతులు, శాశ్వత పునరుద్ధరణ చర్యలకు అవసరమయ్యే నిధులపై అంచనాలు రూపొందిస్తాం. ఈ నివేదికల్ని ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– అయ్యప్పనాయుడు, జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్


వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలు



పరవాడపాలెంలో ఇంటికి మార్కింగ్ ఇస్తున్న నీటిపారుదల, రెవెన్యూ, సర్వే సిబ్బంది

కశింకోట: మండలంలోని పరవాడపాలెంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై అధికారపార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం శోచనీయమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొంతిన శివ ఆక్షేపించారు. గ్రామాన్ని ఆనుకుని ఏలేరు కాలువ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుంటే, అందులో కొంత ఆక్రమిత స్థలంలో ఉందని, దాన్ని తొలగించాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం హేయమన్నారు. వీరి ఒత్తిడితో ఏలేరు కాలువ నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సర్వే జరిపించారు. మార్కింగ్ ఇచ్చి ఆక్రమణలో ఉన్న మేరకు 24 గంటల్లోగా తొలగించాలని ఆదేశించడం అన్యాయమన్నారు. దీని వెనుక మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు ఉన్నా వాటి గురించి పట్టించుకోకుండా, కేవలం రాజకీయ కక్షతో తమ పార్టీ వారి ఇళ్లను మాత్రమే తొలగించేందుకు అధికారులు ప్రయత్నించడం ఆక్షేపణీయమన్నారు.

రంగస్థల నటుడు మిర్తిపాటి మృతి



ఈశ్వరరావు(ఫైల్ ఫొటో)

అనకాపల్లి: ప్రముఖ రంగస్థల నటుడు మిర్తిపాటి ఈశ్వరరావు(78) జీవీఎంసీ విలీనగ్రామం కొప్పాకలో అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందారు. కొప్పాకకు చెందిన రంగస్థల నాటుడు స్వర్గీయ సోమేశ్వరరావు ప్రోత్సాహంతో హరిశ్చంద్ర నాటకంలో లోహితాస్యుడి పాత్రవేసి ప్రేక్షకుల ఆదరణ పొందారు. 15వ ఏట రంగస్థల ప్రవేశం చేసిన ఆయన సుమారు ఆరు దశాబ్దాలుగా వివిధ నాటక ప్రదర్శనల ద్వారా ప్రేక్షకుల్ని అలరించారు. ఆయన మృతిపట్ల నాటక రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ, మృతదేహం వద్ద నివాళులర్పించారు.

శిక్షా సప్తాహ్‌లో నైపుణ్య దినోత్సవం



డీపీఎన్ హైస్కూల్లో రాష్ట్రీయ సంప్రదాయ వస్త్ర ధారణలో విద్యార్థుల ప్రదర్శన



ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు చేసిన ప్రదర్శన అలరించింది. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఉత్సాహంగా తిలకించారు.

నూకాంబికకు శాకంబరి అలంకరణ రేపు



నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయ ప్రాంగణంలోని బాలాలయంలో నూకాంబిక అమ్మవారిని ఈనెల 28న ఆషాఢం నాలుగో ఆదివారం పూజలో భాగంగా శాకంబరిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని శాకంబరిగా అలంకరించేందుకు అవసరమైన కూరగాయల్ని సమర్పించే భక్తులు దేవస్థానంలో తగు రశీదును తీసుకోవాల్సిందిగా కోరారు.

మైనర్ బాలల డ్రైవింగ్ ప్రమాదకరం



రహదారి భద్రత సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి మనోహర్

కశింకోట: మైనర్ బాలలు వాహనాలు నడపడం ప్రమాదకరమని, వారిని వాహనాల డ్రైవింగ్‌కు అనుమతించరాదని జిల్లా రవాణాశాఖ అధికారి జి.మనోహర్ సూచించారు. మండలంలోని కన్నూరుపాలెంలో ఓ ప్రైవేట్ స్కూల్లో శుక్రవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తలకు హెల్మెట్, కారులో సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. ఈ విషయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.గోపీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.అన్నారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటపతిపాలెంలో సమస్యల తిష్ట



శిథిలావస్థకు చేరిన మంచినీటి పథకం



కూలడానికి సిద్ధంగా ఉన్న సామాజిక భవనం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడానికి 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన మినీ మంచినీటి పథకం శిథిలావస్థకు చేరింది. పిల్లర్ల పెచ్చులూడిపోతున్నాయి. ట్యాంకు శ్లాబు పెచ్చులుగా ఊడిపోవడంతో నీరు లీకవుతుంది. తరచూ మోటారు మరమ్మతులకు గురవడంతో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలడానికి సిద్ధంగా సామాజిక భవనం

అలాగే గ్రామంలో 30 ఏళ్ల కిందట నిర్మించిన సామాజిక భవనం శిథిలమై నేడోరేపో కూలడానికి సిద్ధంగా ఉంది. పిల్లర్లు దెబ్బతిని గచ్చులు పాడైపోయాయి. ఏ మాత్రం వర్షం వచ్చినా శ్లాబు కారిపోతోంది. పాడైన సామాజిక భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- వీధి లైట్లు కూడా పూర్తిస్థాయిలో వెలగడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



వెదురుపర్తి కనకదుర్గమ్మకు పూలమాలలతో అలంకరణ

కశింకోట: మండలంలోని వెదురుపర్తిలో కొలువైన దుర్గాదేవి ఆలయంలో కనకదుర్గమ్మను ఆషాఢ శుక్రవారం సందర్భంగా పూలమాలలతో అలంకరించారు. ఆలయ పూజారి శంకరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

డిజిటల్ విద్యా బోధన తప్పనిసరి



డిజిటల్ విద్యాబోధనపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎంఈవో కోటేశ్వరరావు

తుమ్మపాల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ విద్యా బోధన ద్వారానే మెరుగైన విద్యాభ్యాసం జరుగుతుందని ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో 5వ రోజు డిజిటల్ వనరుల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. 21వ శతాబ్దంలో డిజిటల్ బోధన తప్పనిసరన్నారు. విద్యా రంగంలో డిజిటలైజేషన్ యొక్క అనువర్తనాలు, డిజిటలైజెషన్ ద్వారా వివిధ రకాల యాప్‌ల వినియోగం, డిజిటలైజేషన్ ప్రాముఖ్యతను తెలిపే ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రుధిరారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో సందర్శన

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో మంజులవాణి కోరారు. నాగవరం,రాజుపేట గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్యం మెరుగునకు పాటుపడాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి,ఎంపీటీసీ పొలిపిన శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



వెంకటాపురంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కో-ఆర్డినేటర్ జి.నాగలక్ష్మి అన్నారు. వెంకటాపురం సంపద తయారీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న వెంకటాపురం సంపద తయారీ కేంద్రం నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ నీలకంఠస్వామి, ఎంపీటీసీ వీరునాయుడు, మాజీ ఎంపీటీసీ వీరునాయుడు, పంచాయతీ కార్యదర్శి మోహిని లక్ష్మి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి ద్వారా మెరుగైన దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మ వ్యవసాయాధికారి విజేత

మునగపాక : విత్తనశుద్ధి ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆత్మ వ్యవసాయాధికారి విజేత అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అరబుపాలెంలో రైతులతో మాట్లాడారు. విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సుడోమోనస్‌తో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో సాయివాణి, వీఏఏ సత్య రవిరాజ్, రైతులు సూరి అప్పారావు, గంగాధర్, సత్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై గడ్డి విత్తనాల పంపిణీ

కె.కోటపాడు: పాడి రైతులు పశువులకు మేతగా కాకిజొన్న, మొక్కజొన్న రకం గడ్డిని అందించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. కొరువాడ, వి.సంతపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా శుక్రవారం రైతులకు రాయితీపై కాకి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను అందించారు. ఈ రకం గడ్డిని పశువులు మేతగా తినేందుకు ఇష్టపడతాయన్నారు. గడ్డిలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండడం వల్ల పాల దిగుబడి అధికంగా ఇవ్వడంతోపాటు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ రెండు రకాల గడ్డి విత్తనాలను నాటిన 45 నుంచి 60 రోజుల లోపు కోతకు చేరుకుంటుందన్నారు. ఐదు కిలోల కాకిజొన్న గడ్డి విత్తనాలు రాయితీపై రూ.115కు, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలు రూ.85కు ఇస్తున్నట్లు తెలిపారు. వి.సంతపాలెం పశువైద్య సహాయకుడు లింగేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

కె.కోటపాడులో సీపీఎం నిరసన



కె.కోటపాడులో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినట్లు సీపీఎం మండల కార్యదర్శి యర్రా దేముడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో పార్టీ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు, ప్రత్యేక హోదా, విభజన హామీలు, తదితర విషయంలో వివక్ష చూపిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు వనుము సూర్యనారాయణ, చెంబునాయుడు, అప్పారావు, శివ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.